పంచాయతీ ఎన్నికల్లో భద్రాచలం, సారపాక

రెండు పంచాయతీల్లో 60వేల ఓటర్లు
మొత్తం 478 జీపీల ఓటర్ల జాబితా రెడీ
భద్రాద్రి జిల్లాలో 6,81,175 మంది ఓటర్లు
సుజాతనగర్ మండలంలో ఏడు పంచాయతీలు ఎటువైపు?
ఎంపీటీసీల స్థానాలను కలుపుకునే కమిషనరేట్‌కు నివేదిక

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : త్వరలో జరుగబోయే పంచాయతీ ఎన్నికల్లో ఈ సారి భద్రాచలం, సారపాక పంచయతీలకు కూడా ఎన్నికలు జరుగనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటు మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుల సంఖ్య పెరగడంతో పాటు కొత్తగా పంచాయతీల ముఖచిత్రం కూడా మారబోతున్నది. తాజాగా సుజాతనగర్ మండలంలో 7 పంచాయతీలను కార్పొరేషన్‌లో కలుపుతుండటంతో కొత్త చిక్కులు వచ్చే ప్రమాదం ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే గత అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రకారం.. పంచాయతీ ఎన్నికలకు కూడా గత నవంబర్ నెలలోనే ఓటర్ల ముసాయిదాను సిద్ధం చేశారు. అందులో సుజాతనగర్ మండలంలో ఉన్న ఏడు పంచాయతీల ఓటర్ల జాబితాను కూడా పొందుపరిచారు.

478 జీపీలకు ఓటర్ల జాబితా సిద్ధం

జిల్లాలో గతంలో 484 పంచాయతీలు ఉండగా భద్రాచలం, సారపాక పరిధిలోని మూడు పంచాయతీలు శాంతినగర్, అశోక్‌నగర్, ఐటీసీ తగ్గి 481కి చేరింది. దీంతోపాటు కొత్తగా అశ్వారావుపేట మున్సిపాలిటీ కావడంతో మరో మూడు పంచాయతీలు అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు తగ్గాయి. దీంతో జిల్లాలో మొత్తం 478 పంచాయతీలకు ఓటర్ల జాబితాను తయారు చేశారు. భద్రాచలంలో 41,008, సాకపాకలో 19,045 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. మొత్తంగా జిల్లాలో 6,81,175 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు.

మూడు విడతలుగా ఎన్నికలు..

గతంలో జరిగిన ఎన్నికల మాదిరిగానే జిల్లాను యూనిట్‌గా తీసుకుని మూడు విడతలుగా ఎన్నికలు జరిగేలా అధికారులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఇందు కోసం ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. జిల్లాలో 7,656 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచుకున్నారు. ఇప్పటికే ఆయా సిబ్బంది బ్యాలెట్ పత్రాలు, బాక్స్‌లను పరిశీలించి తనిఖీలు చేసుకుంటున్నారు. 2046 బ్యాలెట్ బాక్స్‌లు కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిసింది.

ఏడు పంచాయతీలు ఎటువైపు?

ఈసారి జరుగబోయే పంచాయతీ ఎన్నికల్లో 478 పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయా లేక ఏడు పంచాయతీలు తగ్గుతాయా అనేది ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల కొత్తగూడెం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు అధికారికంగా ప్రకటన వెలువడింది. ఇందులో కొత్తగూడెం, పాల్వంచతోపాటు సుజాతనగర్ మండలంలో ఏడు పంచాయతీలు సైతం కార్పొరేషన్‌లో కలిపినట్లు తెలిసింది. ఇదే నిజమైతే కొన్ని పంచాయతీలకు ఎన్నికలు మినహాయింపు లేకపోలేదు. దీంతో అధికారులు సైతం ఏడు పంచాయతీల విషయంలో ఆలోచనలో పడ్డా పై అధికారులకు మాత్రం ఉన్నది ఉన్నట్లు నివేదికలను తయారు చేసి పంపారు.

కమిషనరేట్‌కు నివేదిక..

ఇప్పటికే జిల్లాలో ఎంపీటీసీల స్థానాల పెంపు కుదింపులపై జిల్లా పరిషత్ పూర్తి నివేదికను సిద్ధం చేసింది. ఇందులో సుజాతనగర్ మండలంలో ఏడు పంచాయతీల్లో 3 ఎంపీటీసీలను కూడా కలిపి నివేదికలను పీఆర్ కమిషనరేట్‌కు పంపింది. దీనిపై పైఅధికారులు ఏం నిర్ణయం తీసకుంటారో వేచిచూడాల్సిందే.

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

ఎన్నికలు ఎప్పుడొచ్చినా మేము సిద్ధంగా ఉన్నాం. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నాం. భద్రాచలం, సారపాక తప్ప మిగతా వాటికి ఓటర్ల జాబితాను ప్రకటించడం కూడా జరిగింది. రెండు పంచాయతీలకు నోటిఫికేషన్ వేయాల్సి ఉంది. గత ఓటర్ల జాబితా ప్రకారం నివేదికలు తయారు చేసుకున్నాం.
– చంద్రమౌళి, డీపీవో, భద్రాద్రి కొత్తగూడెం

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

భద్రాచలం, ఫిబ్రవరి 8: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. బేడా మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఈ కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని త్రిదండి చినజీయర్‌స్వామి దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రిలో విష్ణుసహస్రనామ పారాయణం

భద్రాచలం, ఫిబ్రవరి 8: భద్రాచలంలో విష్ణుసహస్రనామ పారాయణం ఘనంగా నిర్వహించారు. చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో భద్రాద్రికి తరలివచ్చిన వేల మంది భక్తుల సమక్షంలో పారాయణంను భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఘనంగా జరిగింది. అనంతరం క్రీడా ప్రాంగణంలో వేలాది మంది భక్తుల సమక్షంలో విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఈ సమయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు విష్ణుసహస్రనామ పఠనం గావించారు. చినజీయర్‌స్వామి విష్ణుసహస్రనామ పారాయణ ప్రాముఖ్యతను వివరించారు.

108 నామాలతో శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆరాధన, నివేదన సాగిస్తూ ఆ నామాల ప్రాముఖ్యతను భక్తులు రీతిలో వివరించారు. తొలిసారి భద్రాచలంలో నిర్వహిస్తున్న విష్ణుసహస్రనామ పారాయణంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పారాయణంలో పాల్గొన్న వారందరికి అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్

సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 8: ఖమ్మం జిల్లా నెహ్రూ యువ కేంద్రం సహకారంతో కేసీఆర్ నగర్ యూత్ క్లబ్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, సయ్యద్ షారూక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను కొత్తగూడెం జిల్లా గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ మణుగూరులో నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, షటిల్, 200 మీటర్ రన్నింగ్ పోటీలు జరిగాయి. ఈ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు, ప్రిన్సిపాల్ కెప్టెన్ దొడ్డి భద్రయ్య, సీనియర్ లెక్చరర్ రామతిరుపతి చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్టు, మెడల్స్, మెమొంటోస్, సర్టిఫికెట్లు అందజేశారు.

జేసీబీ సీజ్

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని కొత్త సూరారం శివారులో శనివారం మట్టిని అక్రమంగా తవ్వి ట్రాక్టర్లలో లోడింగ్ చేస్తున్నారన్న సమాచారంతో గిర్దావర్ హచ్చా, సిబ్బంది కలిసి అక్కడకు వెళ్లారు. వీరిని చూసిన ట్రాక్టర్ల డ్రైవర్లు.. మట్టిని అక్కడే అన్‌లోడ్ చేసి, ట్రాక్టర్లతో పరారయ్యారు. మట్టి తవ్వుతున్న జేసీబీని గిర్దావర్ సీజ్ చేసి తహసీల్ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదైంది.

కేటీపీఎస్ యాష్ కాంట్రాక్టర్‌పై దాడి

పాల్వంచ, ఫిబ్రవరి 8: కేటీపీఎస్ నుంచి బూడిదను కొనుగోలు చేసి అమ్ముకునే కాంట్రాక్టర్ గుగులోత్ రాంబాబుపై కరకవాగు గ్రామానికి చెందిన ముగ్గురు శనివారం సాయంత్రం దాడి చేశారు. కరకవాగుకు చెందిన ధర్మసోతు చందర్, బట్టు మురళి, జవహర్‌పై పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదైంది.

క్రెడిట్ సొసైటీ గడువు పొడిగింపు

పాల్వంచ, ఫిబ్రవరి 8: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పాలకవర్గం పదవీకాలాన్ని మరో ఆరు నెలలపాటు పొడిగిస్తూ రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్ శనివారం ఉత్తర్వు జారీ చేశారు. ఈ సొసైటీ పాలకవర్గం గడువు 2024 నవంబర్ 4వ తేదీతో ముగిసింది. పాలకవర్గంతోపాటు కార్మిక సంఘాల విజ్ఞప్తితో ఈ ఉత్తర్వు వెలువడింది.

పంచాయతీ కార్మికుల రిలే దీక్ష

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 8: జీతాలు సక్రమంగా ఇవ్వాలన్న డిమాండుతో మండలంలోని ఉమ్మడి లక్ష్మీదేవిపల్లి పంచాయతీ కార్మికులు ఎనిమిది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. వీరి దీక్ష శిబిరాన్ని తెలంగాణ ఉద్యమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య శనివారం సందర్శించి మద్దతు తెలిపారు.

పాఠశాలల సందర్శన

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 8: పట్టణంలోని మేదర బస్తీ, సఫాయి బస్తీ, గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో ప్రభుదయాళ్ శనివారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను, రాత పుస్తకాలను పరిశీలించారు.

మసీద్ కాంప్లెక్స్ కూల్చివేతపై ఆగ్రహం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 8: రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం పేరుతో మసీద్ కాంప్లెక్స్‌ను అన్యాయంగా కూల్చారంటూ ఆర్‌అండ్‌బీ అధికారిపై ముస్లిం పెద్దలు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో డ్రైనేజీ, రోడ్డు విస్తరణ పనులు కొద్ది నెలలుగా సాగుతున్నాయి. రింగ్ రోడ్డు సెంటర్లో మసీదు వద్ద డివైడర్ విస్తరించే క్రమంలో అడ్డుగా ఉన్న మసీద్ కాంప్లెక్స్‌ను తొలగించారు. విస్తరణ పనులను పరిశీలించేందుకు శనివారం వచ్చిన ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావును మసీదు కమిటీ బాధ్యులు కలిశారు. కూల్చివేతపై అభ్యంతరం తెలిపారు. ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

అశ్వారావుపేట (ములకలపల్లి), ఫిబ్రవరి 8: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ములకలపల్లి మండలం సుబ్బనపల్లి గ్రామస్తురాలు బండి వెంకటమ్మ(45) శుక్రవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్నప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వైర్లు తెగాయి. అవి ఆమె నిద్రిస్తున్న మంచంపై పడ్డాయి. విద్యుదాఘాతంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు మేల్కొని, 108కు సమాచారమిచ్చారు. వైద్య సిబ్బంది వచ్చి ఆమెను పరిశీలించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసును ఎస్సై రాజశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 8: మండలంలోని 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మత్తుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ సాయి తరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హామీల అమలుకు 20న 'చలో హైదరాబాద్'

ఇల్లెందు, ఫిబ్రవరి 8: ఎన్నికలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండుతో ఈ నెల 20న 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి తమ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన శనివారం ఇల్లెందు ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి.రసుద్దీన్, నాయకులు తోడేటి నాగేశ్వరరావు, మోహన్ రావు, శ్రీనివాస్, సామేలు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మహా ధర్నా

ఇల్లెందు, ఫిబ్రవరి 8: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 10న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం శ్రేణులకు నాయకుడు అబ్దుల్ నబి పిలుపునిచ్చారు. ఆయన శనివారం ఇల్లెందులోని కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. రైతులు, కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 10న ఉదయం ఇందిరా పార్క్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. నాయకులు ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆవు దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 8: ప్రధాన రహదారిపై ఫోన్‌లో మాట్లాడుతుండగా ఆవు దాడి చేయడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మణుగూరు అశోక్‌నగర్‌లో రోడ్డు మీద బ్లేడ్ బండి డ్రైవర్ జూపల్లి నరసింహారావును ఆవు వచ్చి పొట్టలో పొడిచింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అతన్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

అంతర పంటలతో ఆర్థికాభివృద్ధి

ఫామ్ పాండ్‌లో చేపల పెంపకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్

అశ్వారావుపేట (ములకలపల్లి), ఫిబ్రవరి 8: అంతర పంటల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ప్రధాన పంటలతోపాటు రైతులు అంతర పంటలను సాగు చేయాలని సూచించారు. ములకలపల్లి మండలంలో శనివారం కలెక్టర్ పర్యటించారు. మట్టి ఇటుకలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీని పరిశీలించారు. పాతూరులో రైతు ఈదర మురళి ఫాం పాండ్‌లో చేపల పెంపకాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ఏదో ఒక్క పంటపైనే ఆధారపడకూడదని సరికాదని అన్నారు. చేపలు, నాటు కోళ్లు, తేనెటీగల పెంపకం వంటివి చేపట్టాలని, మునగ వంటి అంతర పంటలు సాగు చేసుకోవచ్చని చెప్పారు. అంతర పంటగా మునక సాగు చేసే రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఆర్థిక ప్రోత్సాహాలు అందిస్తామన్నారు. ఎంపీడీవో రేవతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై హుకుం

నోటీసులు ఇస్తున్న పంచాయతీ అధికారులు

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 8: బూర్గంపహాడ్ మండలంలో అక్రమ నిర్మాణాలు, డ్రైనేజీ ఆక్రమణలపై అధికారులు హుకుం జారీ చేశారు. మండలంలో ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేసినా, పుట్‌పాత్‌లు, డ్రైనేజీలను ఆక్రమించినా వారిపై అధికారులు చట్టపరంగా చర్యలు చేపట్టారు. మండల కేంద్రంలో ఇప్పటికే అక్రమ నిర్మాణాలపై పంచాయతీ అధికారులతో ఆయా యజమానులకు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఎన్నికల హడావుడిలో బిజీగా ఉన్నప్పటికీ సంబంధిత పంచాయతీ అధికారులతో ఆక్రమణలకు పాల్పడుతున్న వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. గతంలో 35 మందికి నోటీసులు జారీ చేశారు.. తాజాగా 25 మందికి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను వ్యాపారులు పరిగణనలోకి తీసుకోకపోతే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జమలారెడ్డి 'నమస్తే'తో చెప్పారు.

జర్నలిస్ట్ క్రికెట్ కప్ విజేత అగ్నిమాపక జట్టు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార అద్దంకి నరేష్

పినపాక, ఫిబ్రవరి 8: పినపాక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా గోపాలరావుపేట క్రీడా మైదానంలో జరుగుతున్న జర్నలిస్ట్ క్రికెట్ కప్ టోర్నీని అగ్నిమాపక జట్టు కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అగ్నిమాపక జట్టు, బీటీపీఎస్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ జట్ల మధ్య హోరాహోరీగా జరగ్గా అగ్నిమాపక జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన అగ్నిమాపక జట్టు క్రీడాకారుడు మధుకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. బీటీపీఎస్ క్రీడాకారుడు రమేష్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. పినపాక తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఎన్ఆర్ఐ కూనారపు ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడ పగడాల సతీష్‌రెడ్డి తన తండ్రి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం అందజేయగా, ద్వితీయ బహుమతిని గడ్డం శంకరాచారి జ్ఞాపకార్థం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్, బూర శంకర్, నాగేంద్రబాబు, మహేష్, భరత్, సంతోష్, దిలీప్, కోటి, నగేష్ పాల్గొన్నారు.

హర్ష ప్రదకు సిల్వర్ మెడల్

టైక్వాండోలో పోటీల్లో పాయం హర్ష ప్రద

ఆళ్ళపల్లి, ఫిబ్రవరి 8: జాతీయ క్రీడల్లో తెలంగాణ తైక్వాండో క్రీడాకారిణి పాయం హర్ష ప్రద సత్తా చాటింది. మహిళల 73 కేజీల విభాగంలో ఫైనల్స్‌కు చేరుకుని సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. పసిడి పోరులో చండీగడ్‌కు చెందిన అమ్మాయికి గట్టి పోటి ఇచ్చి.. సిల్వర్ మెడల్ దక్కించుకుంది. జాతీయ క్రీడల్లో జిల్లాకి మొదటిసారి సీల్వర్ మోడల్ సాధించిన ఘనత హర్ష ప్రదకే దక్కిందని, ఇలాంటి మోడల్స్ మారెన్నో సాధించాలని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కరపత్రం ఆవిష్కరణ

కరపత్రం ఆవిష్కరిస్తున్న డీటీ ముత్తయ్య

టేకులపల్లి, ఫిబ్రవరి 8: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవ కరపత్రాన్ని టేకులపల్లి డిప్యూటీ తహసీల్దార్ ముత్తయ్య శనివారం తహసీల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సేవాలాల్ గుడి చైర్మన్ ఇస్లావత్ నామానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

గుండాల : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

ఆళ్లపల్లి : పోస్టర్ ఆవిష్కరిస్తున్న రేగా కాంతారావు

ఆళ్ళపల్లి, ఫిబ్రవరి 8: అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా చేతులేత్తేసిందని, ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం ఆయన నడిమిగూడెం గ్రామంలో పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీని ముందుకు తీసుకుపోవడం కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అనంతరం ఈ నెల18న జరిగే రెక్కల రామక్క జాతర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు కొమరం హనుమంతరావు, కొమరం వెంకటేశ్వర్లు, నరసింహారావు, పాయం నరసింహారావు, కొమరం వెంకటేశ్వర్లు, వేమూరి రాంబాబు, యాసారపు బాబు, తాళ్ళపల్లి సాయన్న, కొమరం సతీశ్, ఆదామ్, వెంకటకృష్ణ, జగన్, సాంబయ్య, రవి, ముసలయ్య, రాము, వీరస్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కండి

గుండాల, ఫిబ్రవరి 8: బీఆర్ఎస్ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శనివారం గుండాల మండల కేంద్రంలో వివిధ స్థాయిల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా నీరుగారుస్తుందని, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసగిస్తుందని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నదని, ఇచ్చిన హామీలను పూర్తిగా విఫలం చేసిందని అన్నారు. ప్రభుత్వ పాలన ఎక్కడికక్కడ కుంటుపడుతుందని, రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. స్థానిక సంస్థల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్, గడ్డం వీరన్న, మోకాళ్ళ వీరస్వామి, రవీందర్ రెడ్డి, రవి, రాములు, లక్ష్మీనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ : రేగా

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 8: దేశ ప్రజలు కాంగ్రెస్ ఇచ్చే హామీలను నమ్మే పరిస్థితి లేదని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలే రుజువు చేశాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. కనీసం ఒక్క సీట్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలోకి రాలేదని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను ఢిల్లీ ప్రజలు పరిగణలోకి తీసుకోలేదని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. కర్ణాటక, తెలంగాణలో భారీ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో కనీస పోటీ ఇవ్వకుండా పరువు పోగొట్టుకుందన్నారు.

మహిళ కిడ్నాప్ కలకలం..!

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 8 : బస్టాండ్‌లో దిగిన మహిళా ప్రయాణికురాలిని గమ్యానికి చేర్చేందుకు ఆటో ఎక్కించుకుని ఆటో డ్రైవర్, అతని అనుచరుడు కిడ్నాప్‌కు యత్నించిన సంఘటన శనివారం కొత్తగూడెం పట్టణంలో కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి.. పినపాక నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ కొత్తగూడెం పట్టణంలోని తన బంధువులను కలిసేందుకు వచ్చి మధ్యాహ్నం బస్టాండులో దిగింది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఆటోడ్రైవర్ సదరు మహిళను ఆమె గమ్యానికి చేర్చేందుకు వచ్చి ఆటో ఎక్కించుకున్నాడు. ఈ క్రమంలో సదరు ఆటోడ్రైవర్ సెల్‌ఫోన్ నుంచి మహిళ బంధువులకు ఫోన్ చేసి చిరునామా తెలుసుకున్నాడు. ఆటోడ్రైవర్ ఫోన్ చేసి చాలా సేపు అవుతుండడంతో తిరిగి అదే నెంబర్‌కి బంధువులు ఫోన్ చేస్తే అతడు స్పందించలేదు. దీంతో కంగారుపడిన బంధువులు ఆ మహిళను వెతికేందుకు ప్రయత్నించారు. ఇంతలోనే సదరు మహిళా హేమచంద్రాపురం రైల్వేగేట్ వద్ద నుంచి అక్కడి సిబ్బంది ఫోన్ ద్వారా బంధువులకు ఫోన్ చేసింది. తనను ఆటోడ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని, ఈ విషయం ఎవరితోనైనా చెప్తే చంపేస్తామని బెదిరించారని బాధితురాలు తెలిపింది. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న ఆమె బంధువులు బాధితురాలితో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితురాలి బంధువులు వారికి తెలిసిన ఆటోడ్రైవర్ల సహాయంతో సదరు మహిళను కిడ్నాప్‌కి యత్నించిన దుండగులను వెతికే క్రమంలో ఓ ఆటోడ్రైవర్ ఎస్సీ కార్యాలయం రోడ్డులో వెళ్తుండడాన్ని గమనించారు. వెంటనే వారు ఆటోని వెంబడించడంతో వారిని గమనించిన ఆటోడ్రైవర్ కంగారుపడి తప్పించుకునే ప్రయత్నంలో రెండు కార్లను ఢీకొని ఎన్టీఆర్ విగ్రహం వద్ద దొరికిపోయాడు. సదరు ఆటోడ్రైవర్‌కి బాధితురాలి బంధువులు దేహశుద్ధి చేసి వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వరిలో యాజమాన్య పద్ధతి ప్రారంభం

లింగాకర్షక బుట్టలు అందుకుంటున్న రైతులు

చుంచుపల్లి, ఫిబ్రవరి 8: వరిలో యాజమాన్య పద్ధతిపై ప్రాజెక్టును మండలంలోని పెనుబల్లి గ్రామంలో శనివారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో హైదరాబాద్ రాజేంద్రనగర్ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ప్రారంభించారు. యాజమాన్య పద్ధతులు, కొత్త వంగడాలు, లింగాకర్షక బుట్టలు, భూసార పరీక్ష కిట్ తదితరాలపై రైతులకు శాస్త్రవేత్తలు ఎస్‌వీ సాయిప్రసాద్, పద్మావతి, బ్రిజేంద్ర అవగాహన కల్పించారు. లింగాకర్షక బుట్టలను రైతులకు అందజేశారు. మండల వ్య